# మధ్యతరగతి మందహాసం

నాకు మరణించాలని ఉంది.

నాకు జీవించాలని ఉంది.

ఈసాయం సమయంలో పశ్చిమాద్రిన ఎర్రబడ్డ సూర్యుడ్ని చూస్తుంటే ఇంకా ఏమేమో అనిపిస్తోంది. నా మిత్రుడంటాడు....

"యుఆర్ విత్‌ఫుల్ ఆఫ్ కాంట్రడిక్షన్స్" అని. ఆ ఆంగ్లంలో ఎన్ని బూతులున్నాయో నాకు తెలియదు. వాడే తెలుగులో "నువ్వో వైరుధ్యాల పుట్టవి" అనేశాడు.

"చావటం, బతకటం పరస్పర విరుద్ధమైనవి. కానీ నువ్వు రెండు అనుభూతుల్నీ ఆహ్వానిస్తున్నావ్. అయితే నువ్వు ఎయిదర్ రివిజనిస్టువి ఆరే పోయట్‌వి" అని కూడా అన్నాడు.

"నిన్ను అర్థం చేసుకోవటం తెలుగు కవిత్వాన్ని అర్థం చేసుకోవటమంత కష్టంరా నాన్నా" అని నవ్వేడు.

ప్రతిసాయంకాలమూ- ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోవాలని పించిన క్షణం- పశ్చిమాద్రిన కుంగిపోతున్న సూర్యుడి దిశకు విహంగంలా ఎగిరిపోవాలనే ఆరాటం.... నాదేశపు నదీ జలాల్తో ఈ భూమిని స్పృశించి రావాలనీ....కాశ్మీరులోయల్లో, అజంతా, ఎల్లోరాగుహల్లో' తిరుపతికొండల్లో, సజీవ సంప్రదాయపు సౌందర్యాల్ని అనుభూతం చేసుకోవాలనే ఆరాటం....,

ఇవన్నీ కేవలం ఈ జానెడు కడుపు నింపుకోవటం కోసం, నన్ను నమ్ముకొని నాతోపాటు పయనిస్తున్న నావాళ్ళ కోసం.... మరో ముక్కలో 'స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్' కోసం చేస్తున్న పోరాటంలో అన్నింటినీ, వదిలేసుకొని ఈ సాయం సమయాల్లో, ఈ నగరపు కాలుష్యాన్ని కొద్దిపాటిగా ధిగమించిన పొలిమేరల కావల నిలబడి....

"ఇప్పుడు మరణిస్తే! అనిపిస్తుంది.

వాడే అంటాడు.

"నువ్వు పిరికి పందవి. ఈ బాధల నుండి విముక్తం కావాలనుకుంటున్నావ్. బాధలు లేని ప్రపంచం ఎక్కడుంది? ఎటు చూసినా మానవాళి సమస్యల్ని ఎదుర్కొంటూనే ఉంది. దీనికి పరిష్కారం మరణమా?"

మరేమిటి పరిష్కారం? జీవితమా!? ఎక్కడుంది జీవితం?ఎవడికుంది జీవితం? వందల మందికి జీవితాలూ- కోట్ల మందికి దరిద్రాలూ పంచేసిన ఈ దేశంలో నాలాంటి వాడెవడైనా మరణిస్తానంటే ఏమిటీ గగ్గోలు?

"దటీజ్ కాంట్రడిక్షన్. వైరుధ్యం.... వైరుధ్యం.... జీవితంలో కవిత్వపు అడుగడుగునా వైరుధ్యంగా భయ్.... ఆ వెన్నెల వెలుగుల్లో నీ చేతుల్లో కవిత్వపుపుస్తకాన్ని చూసినప్పుడు నువ్వేమన్నావ్!ఐవాంటులివ్.... నేను ప్రతిక్షణమూ ఈ అమృతపు సోనలు తాగుతాను....ఈ కవిత్వపు ప్రపంచంలో తడిసిపోతాను. అన్నావా? అనలేదా"

"అన్నాను. ఐ వాంట్ పోయిట్రీ. నాకు కవిత్వం కావాలి. నా బతుకు బాటలో మల్లెల్నిచల్లే కవిత్వం కావాలి.... నా హృదయంలో వెన్నెల్ని కురిపించే కవిత్వం.... నన్ను బతికించే కవిత్వం కావాలి. ఆ కవితల పాదాలనడుమ నన్ను నేను వెతుక్కోవాలి. ఆ కవిత్వంలోనేనీ విశాల విశ్వాన్ని దర్శించాలి. నేను కవిత్వాన్ని ప్రేమిస్తాను. నేను కవిత్వాన్ని ఆహ్వానిస్తాను. కానీ ఏదీ కవిత్వం? ఎక్కడా లభ్యం కావటం లేదే! నన్ను కవ్వించి, కదిలించే కవిత్వం ఎక్కడుంది? ఎక్కడున్నాయి నన్ను అనుభూతికి గురిచేసే పుస్తకాలు? కనీసం ఈ కథల్లోనూ, కవిత్వంలోనూ మృగ్యమైపోతున్న 'జీవితాన్ని' ఎక్కడ వెతుక్కోను? ఎటు చూసినా 'మరణిస్తున్న' వస్తువులు మించి ఏం కనపడుతున్నాయి?"

"అంతే మరి.... ఆకలయితే మరణాన్ని ఆహ్వానిస్తావు. కడుపు నిండితే వెన్నెల్లో విహరిస్తావ్. నీకేం కావాలో నీకే తెలియదు. నువ్వేం చేయాలో నీకు తెలియదు. ఒక్కసారి కళ్ళుతెరు బేటా! ఇక్కడ నిన్ను కదిలించే కవిత్వమూ ఉంది. నువ్వు కోరుకునే జీవితమూ ఉంది. వాస్తవానికి వెన్ను చూపించే ఓ సూడో ఇంటలెక్చువల్.... ఒక్కసారి జీవితంలోకి రా!"

వాడే వాడే ఈ మాటలంటున్నది. వాడికి కనిపించేదే కవిత్వం.... వాడకుంటే జీవితం.... వాడికి వెన్నెలా వద్దూ వాడికి మరణమూ వద్దు. మరేం కావాలి? వాడికి తెలిస్తేగా! వాడికితె లిసింది ఒక్కటే నన్ను విమర్శించటం.

వాడేమైనా అన గాక నాకీ సాయం సమయాలు మరణించాలనీ, జీవించాలనీ అనిపింపచేస్తుంటాయి.

"ఇంతకూ నువ్వు జీవిస్తున్నావా? మరణిస్తున్నావా?"

"జీవిస్తూ మరణిస్తున్నా.... మరణిస్తూ జీవిస్తున్నా"

"వాటే బ్యూటిఫుల్ కాంట్రవర్సీ"

"గోటూ హెల్ విత్ యువర్ కాంట్రవర్సీ? ఒరేయ్ ఆ వైరుధ్యాలన్నీ మోసుకొని నరకానికి ఫో" అరిచేను.

"ఎందుకురా ఆవేశపడతావ్? నువ్వెందు కింత బాధపడతావ్? వెళ్ళి మన సినిమాలకు మాటలు రాయకూడదూ! మన పత్రికలకి పొయిట్రీ రాయకూడదూ! ఈ వైరుధ్యాల్ని ఆ రంగాలే భరిస్తాయి. అసలు నరకం ఎక్కడుందో తెలుసా? నీలాంటి మేధావుల ఆలోచనల్లో, మన సాహితీ, సాంస్కృతిక రంగాల్లో- ఈ సింబాలిజంలో.... ఈ సమాజంలో-"

వాడు అర్థంకాడు. వాడేం మాట్లాడతాడో వాడికి తెలియదు. అదో రకం భాష వాడు తెచ్చిన పుస్తకాలు చదివాను. ఒక్కముక్క అర్థంకాలా? వాడు తెచ్చిన కవిత్వమూ అంతే. వాడసలు నవ్వడు. ఏడవడు కూడా. వాడు చెప్పే వైరుధ్యాలన్నీ నాకంటగడతాడు తప్పించి వాడే అర్థం కాని మనిషి అందుకే నేనంటాను.

"నాకర్థం అవరా మిత్రమా"

అంత తేలికా! నా జేబులో చిట్టచివరి అయిదు రూపాయల కాయితం.... మరో నాలుగయిదు రోజులదాకా జీతం రాదు. వచ్చి ఎంతసేపుంటుందనేది కాదు ప్రశ్న. నాకు ఉల్లిపాయ దోసంటే ఇష్టం. శ్రీశ్రీగారి బాదంహల్వా ఇష్టం. ఎ.సి. హాల్లో సిన్మాచూట్టం ఇష్టం. ఇంకా సాయంసమయాల్లో టాంక్ బండ్ మీదకు నడిచివచ్చే ఆడపిల్లలంటే ఇష్టం. వారి పెదవులమీద నవ్వులు తళుక్కుమంటున్నప్పుడు... వారి కళ్లలో వెలుగులు యాదృచ్ఛికంగా నామీద ప్రసరిస్తున్నప్పుడు ఎందుకో తెలియని వెర్రి ఆనందం.... ఆక్షణం పదహారు సంవత్సరాల యువతినై పోవాలనిపిస్తుంది.

నడిచివస్తుంటే-అద్దాల మాటున రకరకాల స్వీట్స్....దారిపొడుగునా 'బనానాలు'.... రెండు డజన్లు మాత్రం తీసుకొని స్కూటర్ ముందు బాక్స్‌లో వేసుకొని, ఇంటిముందు శ్రీమతికి హెల్మెట్ అందించి, ఫ్రూట్స్‌తో వెనగ్గావెళ్ళి చిన్నిగాడ్ని ఎత్తుకొని ముద్దాడి రంగుల టీవీ ముందు కూర్చుంటే....టే....

"ఎందుకురా సాయంకాలాలు అలా వంటరిగా నడుచుకుంటూ వెళ్తావ్ పని అయిపోగానే ఇంటికి గావచ్చుగా రావు. ఆ రోడ్లమీద బహుదూరపు బాటసారి ననుకొంటావ్. ఆ గడ్డం పెంచుతావ్.... నువ్వో మహాత్ముడను కొంటావ్. నీ సర్వ దరిద్రాలకూ ఏదో ఒక ఫిలాసఫీ క్రియేట్ చేసుకుంటావ్. ఒరేయ్ మధ్య తరగతి హిపోక్రటిక్ క్రీచరుడా".

నిన్న సాయంకాలం ఇవే కూతలు. వాడే ఆ రాజ్‌గాడే కూసింది. వాడికి నినాదాలు తప్పితే ఇంకేమైనా తెలుసా అని.... నేను మధ్యతరగతి పురుగునైతే వీడెవడంటా? వాడు అధమ తరగతి పురుక్కాదా? వాడెప్పుడూ నన్ను పట్టుకు తిడతాడు తప్పించి.... నన్ను ప్రతిక్షణమూ రంపంతో కోస్తాడు తప్పించి వీడు చేసే మహత్తరమైన పనేంటి? అందరినీ చెడతిట్టడమేనా వీడి తరగతి నైజం ?

అయినా పెధవ ఎంత మిత్రుడైతే మాత్రం వాడి లిమిట్స్ వాడు గుర్తించొద్దూ.

ఊరుకుంటున్నానని ఏదిబడితే అది వాగేయటమేనా? అందుకేగా జీవితంలో మరచిపోని రిటార్ట్ ఇచ్చాను. సరిపోయిందిగా ముఖంలో ఒక్కసారిగా కళ తప్పిపోలా! ఇంతకాలం వీడేం అన్నా భరించాను. ఇప్పుడు నేను నోరుతెరిస్తే ఏమైపోయాడు! అయినా నా జీవితం నా యిష్టం. నేను చావాలనుకుంటా, బతకాలనుకొంటా. నా యిష్టం వచ్చిన కథలు చదువుతా నాకు నచ్చిన కవిత్వం చదువుకుంటా.... వీడికెందుకట ?

ఛ....ఛ.... మెదడు తినేశాడు.... రాత్రంతా నిద్రలేదు. దరిద్రం కంటే భయంకరమైన చర్చలు.... అయినా వెధవ ప్రతిదానికీ తగాదా ఏమిటి? అసలా దబాయింపేమిటి? ఆతిట్టడం ఏమిటి? వీడేదో అన్నీ గుత్తకు తీసుకున్నట్లు. అంత మొనగాడైతే తెల్లారేసరికల్లా ఈ దేశాన్ని మార్చేయమను.

"ఒరేయ్ వెధవా....నేను రోజంతా పనిచేస్తున్నారా, నేను నా పెళ్ళాం బిడ్డల్ని ఈ చెమట చుక్కలు పిండి పోషించుకొంటున్నారా! నీకుమల్లే మీ బాబుగాడు సంపాదిస్తే తింటూ వెధవ కబుర్లు చెప్పటంలా నాకు నచ్చింది నచ్చిందని చెబుతా. నాకు సంతోషం కలిగితే ఆనందిస్తా. నాకు దుఃఖంవస్తే ఏడుస్తా. అసలు నీ ముఖానికి ఎప్పుడన్నా నవ్వటం చేతవునా? ఎప్పుడన్నా హాయిగా ఏడవటం చేతవునా? వాడెవడో డిక్టేటర్‌లా ప్రవర్తిస్తావ్. కాంట్రడిక్షన్ లంటావ్. నీ పిండాకూడంటావ్.... బ్రహ్మాండం బద్దలయిపోతుందంటావ్. ఆఖరికొచ్చి నీ మూలంగానే ఈ దేశం ఇలా తగలబడి పోయిందంటావ్.... నేను మధ్యతరగతి వాడ్నే.... మరి నువ్వో వడివిరా.... నువ్వో తరగతిరా.... వెధవా ఇంకెప్పుడూ నా ముందు మాట్లాడక.... పురుగూ పుట్రా అనకొరే.... నాకు ఏకాంతంగా కలలు కనటం వచ్చు. నాకు అవసరమైతే సంతోషంగా చచ్చిపోగల ధైర్యం ఉంది. ఇందులో నువ్వేమీ చెయ్యలేవు. అందుకే ఇంకెప్పుడూ చర్చలొద్దు. ఇంకెప్పుడన్నా ఆ వైరుధ్యం మాటెత్తావా.... చంపేస్తానంతే.

"అబ్బా" రాయి.... ఎవడ్రా కాంట్రాక్టర్.... సంవత్సరం తిర క్కుండానే రాళ్ళు....రాళ్ళగుంటలు....గోతులు....మీ శవాలు.... బొటన వేలు చిట్లిపోయింది.... రక్తం.... రక్తం.... సూర్యుడు ఎర్రగా.... రక్తం ఎర్రగా....జేబులో నలుగుతున్న అయిదు కాయితం....టించర్ కోసం డాక్టర్ దగ్గరకెళ్ళాలా! ఎవడ్రా రానిచ్చేది.... ఇరవై లేందే కాయితం రాసే దెవడ్రా.... ధర్మాసుపత్రా? ఇంకా నయం నేను కుంటుతూ అయినా నడవొద్దా? కొంచెంసేపు నొక్కి ఉంచితేసరి.... దుమ్ము జల్లితే పోలా ?

అరరే.... చేతికి రక్తం మరకలు.... నేలమీద ఇంకిపోతున్న రక్తపుబొట్లు.... వృథా....వృథా.... ఐవాంట్ రిలీఫ్. నాకిప్పుడు విశ్రాంతి కావాలి. నాకిప్పుడు వినోదం కావాలి. నిన్నటి నుండి మండిపోతున్న ఈ హృదయం మీద చిరుజల్లు కురవాలి. ఎక్కడికి వెళ్ళాలి? రాజ్‌గాడు కూసినట్లు....ఈ మధ్య తరగతి క్రిమికీటకాలకు అవకాశం ఏముంది? అదే మార్గం వెళ్తాను. ఆ థియేటర్‌లో కొంచెంసేపు కూర్చుంటే.... మూడు గంటలసేపు కొద్దిగా రిలీఫ్....

మరి ఈ నాలుగు రోజులో!

జానేదేవ్. ఏమైతే అవనీగాక.... ఈ ప్రపంచం ప్రళయమొచ్చి మునిగిపోనీగాక.... ఆకలికి నా పేగులన్నీ మలమలా మాడిపోనీగాక నాకిప్పుడు వినోదం కావాలి. నేనిప్పుడు మన తెలుగు చిత్రం చూట్టానికే వెళ్తున్నా.

* * *

హాలుముందు జనం....జనం....

లోపలకి వెళ్తే అక్కడా జనం....జనం.... ఎటు చూసినా. ఎన్ని థియేటర్లు కట్టినా జనం, లైట్లు వెలుగుతున్నాయి గుడ్డిగా. వెనక్కి తిరిగి చూస్తే.... ఏమిటంటా వాళ్ళ ఆనందం.... ఎందుకా కెకు్క.... "ఒరేయ్ ఎవరు చూసినా అదే సిన్మారా" ముందుకు చూస్తే....ఛ....ఛ.... ఏమిటా అరుపులు.... తెరపైకి లేస్తోంది. పదహారు రీళ్ళంట.... అమ్మయ్య-

ప్రారంభం....అప్పుడే బూరలు ఎగురుతున్నాయి. పూలు కురుస్తున్నాయి. ఎవరెవరో అరుస్తున్నారు. అదేమిటి తెరముందు వాడి నృత్యం....

ఈ హింస కోసమే నా జేబులో చిట్టచివరి ఐదు రూపాయలు మార్చింది. పావలా మల్లెపూలు కొనుక్కొని, శుభ్రంగా ముఖంకడుక్కొని, కొద్దిపాటి పౌడరు రుద్దుకొని ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుంటుంటే సాయంకాలాలు గడచిపోవూ.

ఇంకా నయం ఇద్దరి నడుమూ మాటలు కూడానా.... ఇంకా ఎన్నాళ్ళకు బాకీలు తీర్తాయి? పిల్లలకు బట్టలు చినగటం.... నొప్పులు రావటం.... బియ్యం అయిపోవటం.... ఇంతకు మించి సరస సంభాషణ కూడానా !

హీరో వచ్చాడు. చిత్రమైన దుస్తులు ధరించేడు. వాడితోపాటు కుర్రాళ్ళు గెంతుతున్నారు. హీరోయిన్ వచ్చింది. జానెడు గుడ్డముక్క చుట్టుకుంది. వాడితో పోట్లాటలు....కలలు....పరిగెత్తటాలు.... దొర్లటాలు.... అబ్బా అంతా చెత్త....ఉత్తట్రాష్.... ఈ జనమంతా. పొంగిపోతున్నారు. నన్ను రాణ్గాడు ఊపుతున్నాడు.

ఇప్పుడు స్క్రీన్మీద వస్తున్న సినిమా ఆగిపోవాలి. క్లోజ్లో నా ముఖం ముందుకు రావాలి. అందులో బాగా కనిపించాల్సింది నా రాక్షస మీసాలు. నా రెండు పక్కలా రెండు టాంకులుండాలి. వాటర్ టాంకులు కాదు. అప్పుడు చివరిసారిగా నేను మాట్లాడతాను.

"అత్యవసర ప్రకటన. ప్రస్తుతం భారతదేశం మా ఆధీనంలో ఉంది. ఇప్పుడు మీకున్న హక్కులన్నీ రద్దుచేశాం. ఈ దేశానికి ప్రజాస్వామ్యం అవసరంలేదు. అందుకే నియంతగా మీ ముందుకొచ్చా. మీరిలాంటి సినిమాలుచూసి ఆనందిస్తున్నారంటే నన్నూ ఆమోదిస్తారు. మిమ్మల్ని చూసికాదూ ఈ నిర్మాతలు వందలాది రంగుల స్వప్నాల్ని విసురుతూంది. ఇప్పుడు మీ అందర్నీ చూస్తుంటే నాకూ వినోదం కావాలనిపిస్తోంది. రెండుసార్లుమాత్రమే బటన్ నొక్కుతా....మొదటి గుండు ఫస్ట్క్లాసు వారిని, రెండోది థర్డ్క్లాసు వాళ్ళని డిస్ట్రాయ్ చేస్తుంది. గుట్టలు గుట్టలుగా పడున్న మీ శవాలమీద రాబందులు ఎగురుతుంటే...."

"స్టాప్ స్టాప్.... ఏవిటా వెర్రి ఆలోచనలు.... సిన్మాకొచ్చి"

"అవును సిన్మానే. ఈ సిన్మాలే నాలో ఇంత దారుణమైన ఆలోచనలు కలిగిస్తున్నాయి. నిజంగానే ఇలాంటి సినిమాల్ని భరిస్తున్న మనం నియంతృత్వాన్ని మాత్రం భరించలేమా ? భరిస్తాం....తప్పకుండా !"

అరే బాబా....ఏమిటా శబ్దం....నా ఆలోచనల్ని తెంపుతోందెవరు ? అదె... ఆ పిల్లవాడు ఏడుస్తున్నాడే....ఆమె బయటకు తీసుకెళ్ళి చేస్తుందేమిటి ? బాదేస్తుందా ఏమిటి ? వాడింకా పెద్దగా ఏడుస్తున్నాడు. అయ్యో జనమంతా నిన్నే చూస్తున్నారే....వీళ్ళ ఆనందంమీద వాడి ఏడుపు రాగం కురుస్తోందే....వాడి కన్నీళ్ళు జలపాతంలా ఈ థియేటర్ నిండా ప్రవహిస్తున్నాయే అమ్మా వీళ్ళంతా తిరగబడకముందే....ఆ పసిబిడ్డను ఏమైనా చేయకముందే....వాడ్ని లాలించు తల్లీ ....

రాజ్‌గాడు వూపుతున్నాడు....

ఉహూ....నేనా ప్రభావంలో పడను.

అయినా పసిబిడ్డ.... కేర్ కేర్‌మంటూ ఏడుపు.... ఏడుపు....

"ఏవమ్మా నీకు బుద్ధుందా ? ఈ సిన్మా చూడకపోతే ఛస్తావా ? ఆ పసివాడు ఏడుస్తున్నాడు. రెండుసార్లు పాలివ్వజోయావు, వాడు తాగలేదు. వాడికి కడుపునొప్పిగా ఉందేమో. వాడికి చల్లటిగాలి కావాలేమో....అయినా ఈ సిన్మాలో ఏం చచ్చిందని.... ఇందులో ఏ ఆనందం వెతుక్కుంటున్నావ్. ఛస్తే ఈ దేశం బాగుపడదు. ఏమిటలా చూస్తావ్... ఈ దేశం బాగుపడదంతే.... ఇంకా అలా నిలబడ్డావేమిటి.... వెంటనే ఆ పిల్లాడ్ని తీసుకొని ఇంటికి వెళ్తావా.... టాంకుతో...."

"కొంచెంసేపు బయట ఉండకూడదూ" అనేశా రెవరో.

ఆమె నిస్సహాయంగా చూస్తోంది. ఆమెలో కోపం ఉవ్వెత్తున లేస్తోంది. పిల్లాడికేసీ, తెరకేసీ కసికసిగా చూస్తోంది. వాడివీపు ఇంకా చిరిగిపోతుందేమో.... వెంటనే ఏమైనా చేయాలి....

నేను లేచాను.

ఆమె దగ్గరగా వెళ్ళాను.

"చూడమ్మా.... ఈ పిల్లాడ్ని నాకివ్వు నువ్వు సిన్మా చూడు"

వీడ్ని నేను ఆడిస్తాను."

అనుమానంగా చూస్తోంది.

"ఇక్కడే ఆడిస్తాను"

"మీరు సిన్మా చూడరా ?"

"చూడాలనే వచ్చాను. ఇదేం నాకు ఆనందం కలిగించటంలేదు. ఈ బాబుతో ఆడుకుంటాను".

ఆమె అనుమానంగా, చిత్రంగా చూస్తూ వాణ్ని అందించింది.

వెన్నెల కురుస్తోంది. వాడ్ని ఎత్తుకొని చందమామను చూపిస్తుంటే నవ్వుతున్నాడు. వాడి కళ్ళనుండి తిరిగి ఓ కన్నీటిచుక్క వచ్చింది. బయటకు తీసుకెళ్ళి ఓ బిస్కట్ తీసుకుంటే.... చిల్లరుందా ? ఉంది.... పావలా కాసు. బిస్కట్ చేతిలోకి తీసుకొని వాడు నాతో ఏదో మాట్లాడటానికి ప్రయత్నం చేస్తున్నాడు. వీడికే భాషవస్తే ఏం మాట్లాడతాడో....

కంగారుగా ఆవిడే వస్తోంది.

"చూడమ్మా.... నువ్వేం కంగారుపడకు. నీ బిడ్డను నేను జాగ్రత్తగా చూసుకొంటాను. నేను పిల్లల్ని తీసుకెళ్ళేవాడ్నికాదు. నువ్వు హాయిగా సినిమా చూడు"

ఈసారి తృప్తిగా లోనకు వెళ్ళింది.

వెన్నెల్లో వాడు నా గుండెలమీద తంతున్నాడు చిరునవ్వులు చిందిస్తున్నాడు.

నాకు వాడి ముఖంలో నాక్కావాల్సిన కవిత్వం, నేను కోరుకునే విశ్రాంతి, వినోదం లభిస్తున్నాయి. ఇప్పుడు తిరిగి జీవించాలనిపిస్తోంది. కాలిదగ్గర ఎప్పుడో గడ్డకట్టింది రక్తం.... నా జేబంతా ఖాళీగా ఉంది. అయితేనేం.... ఎంత చక్కని పసిబిడ్డ....

"పాపం వీడ్ని కూడా చావబాదడానికి తయారైందంటే కనీసమైనా విశ్రాంతి కోసం ఎంత తహతహలాడిందో.... ఈ సినిమానూ అనుభవించగలుగుతుందంటే ఆమె వినోదం కోసం ఎంత తపించిపోతుందో."

ఆమెను సానుభూతితో అర్థం చేసుకుంటున్నకొద్దీ కొత్తకొత్త ఆలోచనలొస్తున్నాయి. ఆమె మీద కోపం రావటం లేదు. రాజ్‌గాడనే పైరుధ్యాలూ.... అర్థం కాకపోవటాలూ ఏమీ లేవు. వాడ్ని ఎంత బాదినా ఆమె తల్లే. ఈ రెండు గంటల తర్వాత వాడ్ని హృదయంలో దాచుకుంటుంది. ఈ దేశంలో నాలాంటి వాళ్ళే ఎక్కువ. రాజ్‌గాడు ఈ విషయం తెలుసుకోవాలి. మమ్మల్ని తిట్టడంకన్నా అర్థం చేసుకోవాలి. మమ్మల్ని రెచ్చగొట్టడంకన్నా మెల్లగా మార్చుకునే ప్రయత్నం చేయాలి. వాడొచ్చి ఈ పసిబిడ్డ ముఖంలోకి చూడగలిగితే బాగుండును.

"బాబునిస్తారా ?" మెరుస్తున్న కళ్ళతో ఆమె.

అప్పుడే సినిమా అయిపోయిందా! జనం గుంపులు గుంపులుగా, నా చేతి నుండి బిడ్డను అందుకుందామె. ఆమె దగ్గరకు వెళ్తూ తిరిగి నవ్వేడు. అవును. ఈ ప్రపంచం రేపటి నుంచీ వాడిది. ఆమె కళ్ళలో కృతజ్ఞతా భావం తొణికిసలాడుతోంది.

"వస్తానండి" అందామె.

తలూపాను.

ఎందుకో ఆ కళ్ళలో తడి ఉందనిపించింది.

పసిబిడ్డను హింసించినందుకా ? తన పరిస్థితికి తనే జాలిపడా ?

ఏమో ఏమైనా కావచ్చు! నాకిప్పుడు ఎంతో సంతోషంగా ఉంది.

జీవితాన్ని జయించగలననే ధీమా కలుగుతోంది.

ఈ విశ్వాసం శాశ్వతమైతే ఎంత బాగుంటుంది.

— ఈనాడు ఆదివారం